
# సీటుకు నోటుపై.. అగ్గి మీద గుగ్గిలం

ధ్వజమెత్తిన కాంగ్రెస్ అసంతృప్తులు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌ను తూర్పారబట్టిన నాయకులు
- గాంధీభవన్‌పై రాళ్ల దాడితో పాటు జెండాలు తగలబెట్టిన విష్ణు వర్గీయులు
- కూకట్‌పల్లిలో పార్టీకి రాజీనామా చేసిన గొట్టిముక్కల వెంగళరావు
- కోట్ల రూపాయలు ఖర్చు చేయించి మోసం చేశారంటున్న చిగురింత దంపతులు
- నేడు కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై నిర్ణయం
- అధిష్ఠానానికి మూడు రోజుల గడువు ఇచ్చిన ఇబ్రహీంపట్నం దండెం రాంరెడ్డి
- ఎల్బీ నగర్‌లో మధు యాష్కీకి మొదటి రోజే చేదు అనుభవం


గాంధీ భవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న విష్ణువర్ధన్ వర్గీయులు

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం మొదటి జాబితా విడుదల చేసినప్పటి నుంచే చాలా మంది ఆశావహులు నిరుత్సాహానికి గురయ్యారు. చాలా మందిలో అగ్గి రాజుకున్నట్టు అయ్యింది. కొత్త ముఖాలకు టికెట్లు ఇవ్వడంతో నిప్పు అంటుకున్నట్టు అయ్యింది. కాగా, హైదరాబాద్ మహా నగరంలో కాంగ్రెస్ టికెట్ ఫర్ సేల్ అగ్గి రాజేసింది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి కోట్లాది రూపాయలకు టికెట్లు అమ్ముకున్నారంటూ అనేక నియోజకవర్గాల్లో ఆశావహులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం రాత్రి విడుదల చేసిన ఆ పార్టీ రెండో జాబితా పలుచోట్ల కుమ్ములాటలకు కారణమైంది. మొదటి జాబితాతోనే అగ్గి ఆశావహుళ్లో అగ్గి రాజుకున్నట్టు ఉండగా, రెండో జాబితా విడుదల చేసి అప్పటి వరకు మిన్నకుండిన ఆశావహుల్లో రాజుకున్న అగ్గిపై గుగ్గిలం చల్లినట్టు అయ్యింది. 'అగ్గి మీద గుగ్గిలం' చల్లి మంటలు మరింత ఎగిసిపడేలా ఆజ్యం పోసేందుకు 'టికెట్ ఫర్ సేల్' ఉదంతం దోహపడింది. అయితే, శనివారం ఉదయం ఆరోపణలతో మొదలైన ఈ వేడి... సాయంత్రానికి గాంధీభవన్‌ను తాకింది. జూబ్లీహిల్స్ నుంచి టికెట్ ఆశించి, భంగపడిన విష్ణువర్ధన్ రెడ్డి వర్గీయులు ఏకంగా గాంధీభవన్‌పై రాళ్ల దాడికి పాల్పడ్డారు. రేవంత్ టికెట్ అమ్ముకున్నాడంటూ ఆయన ఫ్లెక్సీలు చింపడంతో పాటు పార్టీ జెండాలను తగులబెట్టారు. పలువురు హస్తం పార్టీకి రాజీనామా చేయగా, మరికొందరు అధిష్ఠానానికి అల్టిమేటం జారీ చేశారు. ప్రధానంగా పలువురు నేతలు ఆదివారం అనుచరులతో సమావేశమై తదుపరి నిర్ణయాన్ని ప్రకటిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు ప్యారాచూట్ నేతలకు టికెట్ దక్కడంతో స్థానిక నేతలు అప్పుడే సహాయ నిరాకరణ మొదలుపెట్టారు.

### మొదలైన సహాయ నిరాకరణ...

ప్యారాచూట్ నేతలకు ప్రాధాన్యత ఇవ్వడంతో పలు నియోజకవర్గాల్లో అప్పుడే కాంగ్రెస్ శ్రేణుల నుంచి అభ్యర్థులకు సహాయ నిరాకరణ మొదలైంది. ఎల్బీనగర్ అభ్యర్థిగా ప్రకటించిన మధు యాష్కీ గౌడ్ నియోజకవర్గానికి రాగా పలువురు సీనియర్ నేతలు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. యాష్కీ దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా దేవాలయానికి రాగా సీనియర్ నాయకులు మల్‌రెడ్డి రాంరెడ్డితో పాటు ఇతర సీనియర్ నాయకులెవరూ కనిపించలేదు. అదే విధంగా మహేశ్వరం టికెట్ కేఎల్ఆర్‌కు ఇవ్వగా, ఇక్కడ కూడా ఆయనకు సహాయ నిరాకరణ మొదలైంది. కేఎల్ఆర్ మొదటిసారిగా శనివారం నియోజకవర్గానికి రాగా... కేవలం డీసీసీ అధ్యక్షుడు చల్ల నర్సింహారెడ్డి మాత్రమే ఆయన వెంట ఉన్నట్లు తెలిసింది. టికెట్ ఆశించిన ఇతర పలువురు నేతలు ఆయన కార్యక్రమాలకు దూరంగానే ఉన్నారు.

### రాత్రి జాబితా.. అసంతృప్తి మంటలు

కాంగ్రెస్ పార్టీ రెండో జాబితాతో హైదరాబాద్ మహా నగర పరిధిలోని అనేక నియోజకవర్గాల్లో ఆశావహులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి శుక్రవారం ఉదయమే రెండో జాబితాను విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ... కుమ్ములాటలను ముందుగానే గుర్తించిన అధిష్ఠానం జాబితాను రాత్రి విడుదల చేసింది. అయినప్పటికీ శనివారం ఉదయం నుంచే అనేక నియోజకవర్గాల్లో అసంతృప్తి మంటలు చెలరేగాయి.

- **జూబ్లీహిల్స్** నుంచి టికెట్ ఆశించిన పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్‌రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. డబ్బులు తీసుకొని ప్యారాచూట్ నేతకు టికెట్ అమ్ముకున్నారని విమర్శించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తాను పోటీలో ఉంటానని తేల్చి చెప్పిన విష్ణువర్ధన్‌రెడ్డి ఆదివారం కార్యకర్తలతో సమావేశమై తన కార్యాచరణ ప్రకటిస్తానన్నారు.
- **కూకట్‌పల్లిలో** కూడా ప్యారాచూట్ నేతకు టికెట్ ఇవ్వడంతో నియోజకవర్గానికి చెందిన స్థానిక నేత గొట్టిముక్కల వెంగళరావు తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి కోట్ల రూపాయలకు టికెట్ అమ్ముకుంటున్నాడని కన్నీరు మున్నీరయ్యారు. కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు.
- **మహేశ్వరం** టికెట్ ఆశించి భంగపడిన బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి కూడా తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. తన నివాసంలో అనుచరులు, పార్టీ కార్యకర్తలతో సమావేశమై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా ఒక కార్యకర్త పెట్రోలు పోసుకోవడంతో కొద్దిసేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆదివారం తమ వర్గీయులతో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటిస్తానని ఆమె స్పష్టం చేసినట్లు సమాచారం. అదే విధంగా టికెట్ ఆశించిన మరో నేత దేప భాస్కర్‌రెడ్డి కూడా ఆదివారం అనుచరులతో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.
- **ఇబ్రహీంపట్నం** నియోజకవర్గంలోనూ ఆశావహులు రేవంత్‌పై ధ్వజమెత్తారు. దండెం రాంరెడ్డి తన వర్గీయులతో సమావేశమై, మూడు రోజుల్లో అధిష్ఠానం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని అల్టిమేటం జారీ చేశారు.
- ***ఎల్బీనగర్, రాజేంద్రనగర్, శేరి లింగంపల్లి, అంబర్‌పేటల్లోనూ*** పలువురు ఆశావహులు అసంతృప్తికి గురయ్యారు. ప్రస్తుతానికి వీరు బయటకు రాకున్నా... రెండు, మూడు రోజుల్లో కార్యకర్తలతో సమావేశమై తదుపరి కార్యాచరణ ప్రకటించేందుకు సిద్ధమవుతున్నారు.



### రేవంత్‌పైనే అందరి గురి...

ఆశావహులు తమకు టికెట్ రాకపోవడంతో ప్రధానంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిపైనే తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కాంగ్రెస్ టికెట్లను అమ్ముకుంటున్నారని ఆదిలోనే కొందరు నేతలు గుర్తించి బయటికి వెల్లడించారు. అయినప్పటికీ చాలా మంది నాయకులు అలా ఉండకపోవచ్చని ఆశించారు. కానీ, తీరా రెండో జాబితా విడుదలైన తర్వాత ప్యారాచూట్ నేతలు, అసలు నియోజకవర్గానికి సంబంధంలేని వారిని ఎంపిక చేయడంతో కచ్చితంగా టికెట్ ఫర్ సేల్ పెద్ద ఎత్తున సాగిందని నమ్ముతున్నారు. దీంతో పాటు చాలా కాలంగా రేవంత్‌రెడ్డి మీకే టికెట్ అంటూ నమ్మించి.. కోట్ల రూపాయలు ఖర్చు పెట్టించారని, తీరా జాబితా దగ్గరికొచ్చే సరికి సంబంధంలేని వారిని ప్రకటించడం వారిని మరింత ఆగ్రహానికి గురి చేస్తుంది. మహేశ్వరం నియోజకవర్గానికి చెందిన మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డికి ముందు నుంచి రేవంత్‌రెడ్డి 'మీకే టికెట్' అంటూ చెప్పుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆరు గ్యారంటీల ప్రకటన కోసం కొంగరకలాన్‌లో ఏర్పాటు చేసిన సమావేశాన్ని పారిజాత భర్త నర్సింహారెడ్డి అన్నివిధాలుగా భారం మోసం ఏర్పాట్లు చేశారు. పైగా ఐదెకరాలు.. రూ.10 కోట్లు అంటూ ప్రచారం కూడా జరిగింది. ఈ క్రమంలో కచ్చితంగా టికెట్ వస్తుందనే భరోసాతో వాళ్లు ఏకంగా కాంగ్రెస్ అభ్యర్థి అంటూ ప్రచార రథాలను కూడా తయారు చేయించుకున్నారు. కానీ, జాబితాలో పేరు లేకపోవడంతో అన్ని విధాలుగా తాము మోసపోయామని సన్నిహితుల వద్ద వాపోతున్నట్లు తెలిసింది.

## టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ, అక్టోబర్ 28 : టీ-సేవ బ్యాంకు మిత్ర కేంద్రాలను ఏర్పాటు చేసుకోవడానికి తెలంగాణ వ్యాప్తంగా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు టీ-సేవ సంస్థ డైరెక్టర్ అడపా వెంకట్‌రెడ్డి తెలిపారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ టీ-సేవ బ్యాంకు మిత్ర ద్వారా డెబిట్‌కార్డ్స్, లైఫ్‌టర్మ్ ఇన్సూరెన్స్ చెల్లింపులు, బస్సు, రైలు, విమానాల టికెట్స్ బుకింగ్, కొత్త పాన్‌కార్డు, టెలికాం పోస్ట్‌పెయిడ్, ప్రీపెయిడ్, ఆల్ బ్యాంక్స్ మనీ ట్రన్స్‌ఫర్లు, ఆధార్ పెమెంట్ సిస్టం, మైక్రో ఏటీఎం సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, ఇంజినీరింగ్ అర్హత గల యువతి, యువకులు వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని కోరారు. వివరాలకు 8179955744, ఆన్‌లైన్‌లో www.tse-vacentre.com లో సంప్రదించాలన్నారు.

## జిల్లాలో 29 పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్

- రోజూ 6,200 మందికి విజయవంతంగా అల్పాహారం
- బ్రేక్‌ఫాస్ట్ అందుతున్న జాబితాలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు

సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): సీఎం కేసీఆర్ సంకల్పం ప్రకారం జిల్లాలో గత నెలలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకానికి అద్భుత స్పందన లభించింది. ప్రధానంగా ఈ పథకం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల ఆకలిని తీర్చడం కోసం సీఎం కేసీఆర్ తీసుకున్న అద్భుతమైన నిర్ణయాలలో ఇదొకటి. వాస్తవంగా చెప్పాలంటే దసరా పండుగ కంటే ముందుగా ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని అధికారికంగా ప్రారంభించారు. దసరా పండుగ సెలవుల తర్వాత అన్ని పాఠశాలల్లో క్రమంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. అందులో భాగంగా ప్రస్తుతం జిల్లాలోని దాదాపు 29 ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించి అమలు పరుస్తున్నారు. ఈ మేరకు ప్రతి నియోజక వర్గంలోని దాదాపు రెండు పాఠశాలలు ఎంపిక చేశారు. దశల వారీగా అన్ని స్కూళ్లలో బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అమలు చేయాలన్నదే సీఎం నిర్ణయం. అందుకు జిల్లా అధికారులు, స్థానిక మంత్రులు, కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 29 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ద్వారా రోజూ 6,200 మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతున్నట్లు జిల్లా విద్యాధికారిని ఆర్.రోహిణి తెలిపారు.

## ప్రింటింగ్ ఏజెన్సీలు నిబంధనలు అతిక్రమించొద్దు



సిటీబ్యూరో, అక్టోబర్ 28(నమస్తే తెలంగాణ): బల్దియా పరిధిలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు హైదరాబాద్ జిల్లా అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలతో నోడల్ అధికారి ఎన్.ప్రకాశ్ రెడ్డి ప్రత్యేక సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో (మోడల్ కోడ్) ఎన్నికల కోడ్ అమలు, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కర పత్రాలు, పోస్టర్లు, పత్రికల్లో వచ్చే ప్రకటనలపై ప్రత్యేక దృష్టి సారించామని, ప్రింటింగ్ ఏజెన్సీలు నిబంధనలు పాటించాలన్నారు. పోస్టర్లు, కరపత్రాలపై పబ్లిషర్ వివరాలను తప్పనిసరిగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రింటింగ్ ఏజెన్సీలకు సూచించారు. ఆర్డర్లకు సంబంధించిన వివరాలను mccelectionadvts @gmail. com ద్వారా ఎన్నికల అధికారులకు సమర్పించాలని సూచించారు.

## రాహుల్ గాంధీ బీసీల ద్రోహి..

కాంగ్రెస్ పార్టీని బొందపెట్టాలి: జాజుల శ్రీనివాస్ గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్ గౌడ్

రవీంద్రభారతి, అక్టోబర్ 28: కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ బీసీల ద్రోహి అని, కుల జనగణన పేరుతో మరోసారి బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ పార్టీ పూనుకున్నదని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే బీసీనే ముఖ్యమంత్రి చేస్తుమన్నా హోంశాఖ మంత్రి అమిత్ షా సూర్యాపేటలో ప్రకటించినందుకు గాను ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు బీసీ ముఖ్యమంత్రిని ప్రకటించాలన్నారు. బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీకి దేశ రాజకీయాలపై అవగాహన లేదని, సామాజిక న్యాయంపై అవగాహన లేదన్నారు. ఉద్దంపూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రెండు ఎమ్మెల్యే సీట్లు బీసీలకు ఇస్తామని చెప్పిన రాహుల్ గాంధీ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేతుల్లో బందీ అయినాడని ఆయన విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా రెడ్ల పార్టీగా మిగిలిపోయిందని, రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బీసీలు బంగాళాఖాతంలో పాతిపెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. 75 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటి వరకు బీసీ ముఖ్యమంత్రిని చేయలేదని, రాహుల్‌గాంధీ ఎన్నికల ముందు బీసీ బిల్లును పార్లమెంట్‌లో పెడుతామని మరోసారి బీసీలను మోసం చేయడానికి ముందుకు వస్తున్నాడని ఆయన దుయ్యబట్టారు. 60 శాతం ఉన్న బీసీలకు కేవలం 20 సీట్లు ఇచ్చి 5 శాతం ఉన్న రెడ్లకు 48 ఎమ్మెల్యే సీట్లు ఇవ్వడం దారుణమన్నారు. రేవంత్‌రెడ్డిపై బీసీలు తిరగబడాలని ఎక్కడ బహిరంగ సభలు నిర్వహించిన బహిష్కరించాలని, బీసీలు ఆయన సభలకు వెళ్ళకూడాని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం జాతీయ అధ్యక్షుడు విక్రం గౌడ్, కుందాల గణేష్‌చారి, మహేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.